కవితా కౌముది

# నవ్వు

వేమూరి విజయలక్ష్మి

**నవ్వు - పెట్టని ఆభరణం మనిషికి**

నవ్వుతూ, నవ్విస్తూ బ్రతకాలి
కాని సమయాన్ని బట్టి నవ్వే నవ్వులలో తేడాలు -
పసిపాపవి చింతలేని బోసినవ్వులు
ఆడే పాడే చిన్నారులవి మురిపించే నవ్వులు
వయసులోని యువతవి హృద్యమైన నవ్వులు
మనిషినీ మనిషినీ బంధించేవి స్నేహపూరితమైన నవ్వులు
దంపతులను కలిపి ఉంచేవి
ఆ బంధంలోని మధురమైన నవ్వులు
గురు శిష్యుల మధ్య, గురువుది వాత్సల్య పూర్వకమైన నవ్వైతే,
శిష్య పరమాణువుది గౌరవ సూచకమైన నవ్వు.
అపరిచితులను దగ్గర చేసేది పరిచయం గావించే నవ్వు.
నవ్వు రాకపోయినా నవ్వే నవ్వు తెచ్చి పెట్టుకున్న నవ్వు.
హాస్య సన్నివేశాలలో ఫక్కుమనిపించే నవ్వులు.
చిన్నారులను దీవించేటప్పుడు తళుక్కుమనేవి
ప్రేమపూర్వకమైన ఆశీర్వదించే నవ్వులు. ఇంకా
చేతగాని నవ్వులు, వ్యంగ్యమైన నవ్వులు,
భయంకరమైన నవ్వులు, చులకన పరిచే నవ్వులు,
భయం గొలిపే నవ్వులు.
నవ్వులెన్ని రకాలైనా
నవ్వులపాలు చెయ్యని నవ్వులు
నవ్వులతో నవ్వులు పంచే నవ్వులు
అవే మనిషికి వరమని తెలుసుకుంటే
అదే నిజమైన నవ్వుకి అర్థం, పరమార్థం..!

## సుక్కనై రాతిరేల..

విజయభాస్కర్

**గురుతుకొస్తే సాలె, నా ఎంకి,**
గుబులు గుండై పోతాది..
నన్ను నేను మరచేపోతానే.
నాకు నా గురుతు రానీయకే..

తోడుగా నువ్వొస్తే,
పగలు సీకటై పోతాది..
నేను నీతో ఏకమై పోతానే.
నా తోడు వొదలకే..

దొరకనన్నావంటే ఓ నా ఎంకి,
బరువు బ్రతుకై పోతాది..
లోకమంతా నాకు ఎతుకులాటే.
నాతో దోబూచు లాడకే..

సూసీ నను దాటేసినావంటే,
యింక నేనెక్కడుంటానే..
సుక్కనై రాతిరేల
నీకు తోడవ్వకుంటానే ?

## రేవు నుంచి రేవుకు

మాకినీడి సూర్యభాస్కర్

ప్రవాహానికే...
రేవు!

రెండు తీరాల మధ్య
పరిగెత్తే నిరంతర చైతన్యం
ప్రవాహం!
అదే పచ్చదనం
అదే ఆకాశ నీలిమ...
ఒకే ఇసుక తీరం
ఒకే గాలి దుమారం
నదికి అటూ ఇటూ
రెండు రేవులు...
రేవులు రెండూ...
రెండు ప్రపంచాలు!
మెలకువ రేవులో ఎక్కిన నావ
అవతల నిద్ర రేవును చేరుతుంది
రెండు ప్రపంచాల మధ్య
ప్రవహించే నిరంతర చైతన్యం కదా...
జీవితం!
బ్రతుకు రేవులో ఎక్కిన నావ
అవతలి రేవుకు చేరక తప్పదు!

## వేదన
### సన్నిహిత్

కనుల ముందు రాళ్ళ బాట
కరిగి పోని కలల వేట
ఆశయాల దారి వెంట
అలుపెరుగని వెతుకులాట
సామాజిక స్పృహయన్నది
జనం నవ్వుకునే పిచ్చిమాట
సామన్యుడి బ్రతుకన్నది
విలువ లేని గడ్డి మేట
జన జీవన యజ్ఞంలో
బడుగు జీవి సమిధయంట
నిశి రాత్రి గగనంలో
రాలిపడే ఉల్కయంట

## నవ మేనక
### మల్లాప్రగడ బాలాత్రిపుర సుందరి

తీరని నిద్ర కనురెప్ప విప్పనీయనంటుంది
కదలిపోతున్న కాలం తప్పదంటుంది
కలల దుప్పటిని తన్నేయడంతో
నాటి పరుగుపందెం మొదలవుతుంది.
శకుంత పక్షుల నీడలో
పసిడి బొమ్మను వదిలేసి వెళ్తున్న మేనకలా
"డే కేర్"లో పిల్లల బరువు మనసుకెక్కించుకుని
కొలువుకూటం చేరుకుంటాను.
గడియారం వైపు చూడాలంటేనే గాభరాగా వుంటుంది
ఉదయం అంతగా పరుగులు పెట్టే కాలం
కచేరీలో ఘనీభావిస్తుందేమా అని విస్తుపోతాను.

## మట్టి రూపులం - శిల్పం

నీట మునిగి తేలుతున్న
మట్టి రూపులం మనం
చివరి మజిలి చావేనని
తెలిసి మసలు తున్నాం...
వెంటరాని సంపదకై
వృధా శ్రమిస్తున్నాం..
చెడుని చేరి, మంచుగ
మంచిని కరిగిస్తున్నాం ......
రాని నవ్వుని నలుగురిలో
రంగరించుతున్నాం
'కల్పితం'తో కసిగా
కరుణని కాలరాస్తున్నాం

## బోస్టన్ గడియారం
### మల్లాప్రగడ రామారావు

సెకెండ్లు నడవడానికి

నిమిషాలు పడుతుంటే,

నిమిషాలు గడవడానికి

గంటలు చాలకపోవడంలో వింతేముంది?

# దరహాస చంద్రిక

జ్యోతిర్మయి

నిన్న బద్దకంగా నిదుర లేచాను
చల్లగాలి వీడ్కోలు చెబుతూ వెళ్ళిపోయింది
కిరణాలు వెచ్చగా గుచ్చుకున్నాయ్

మెల్లగా వ్యాహ్యాళికి బయలు దేరాను
అబ్బ ఈ ప్రకృతి ఎంత అందంగా వుందో
ఎత్తైన చెట్లు, చెట్టు మీద ఎగిరే గువ్వ పిట్టలు,
పచ్చటి కొండలు, పరగులేత్తే జింకలు

నడకలో తెలియ కుండానే చాలా దూరం వచ్చేశాను
పిల్లలు ఎంత చలాకీగా ఆటలాడుకుంటున్నారో
స్నేహితులతో కబుర్లు చెపుతూ సాగి పోతున్నారు
ఆ ఇంటి ముందు ఎర్ర గులాబి గాలికి అందంగా ఊగుతోంది

ఎన్నెన్ని రంగులో ఎన్ని రూపాలో
రంగు రూపు ఆకృతి లేని నన్ను చూసుకుని
దుఃఖ భారంతో క్రుంగి పోయాను
నన్నూ జీవన స్రవంతిలో కలిపేయమని
భగవంతుణ్ణి వేడుకున్నాను

ఇదేమిటి ఇలా నీలంగా మారిపోతున్నా నేమిటి
క్షణ క్షణానికి ఎలా బరువైపోతున్నా నేమిటి
ఇంతకు మునుపెప్పుడూ ఇలా లేదే
నా రూపం కరిగినీరై నేల పైకి జారిపోతున్నాను
నేను దరి చేరగానే చిన్ని విత్తనం మొలకై పోయిందేమిటి
నా సంతోషం మొగ్గ తొడిగి సిరమల్లె పూసింది
ఆ పరిమళం మీ పెదవులపై దరహాస చంద్రికై నిలిచింది -
ఒక రూపంటూ లేని మేఘాన్నే నేను..
రూపాలెన్ని మార్చినా కరిగి నీరయ్యే దాన్నే నేను..!!

## జ్ఞాపకాలు
## శ్రీవల్లి , హైదరాబాదు

జ్ఞాపకాలు మనసు పుస్తకంలో పదిలంగా రాసుకున్న
అనుభవాలు
మదిలో విహరించే గడిచిన ఊహాచిత్రాలు
మనకు దేవుడు ఇచిన గొప్ప వరాలు
కొన్ని అనుభవాలు తియ్యగా....హాయిగా
కొన్ని అనుభవాలు చేదుగా....బాధగా
కొన్ని ఒక అందమైన స్వప్నంలా......

కొన్ని కంట తడి పెట్టిస్తాయి...
కొన్ని చిరునవ్వుని కురిపిస్తాయి...
కొన్ని మనసారా హత్తుకుంటాయి ...
కొన్ని కోపంతో చీదరించుకుంటాయి...
ఎడబాటులో మన తోడు నిలిచే నేస్తాలు జ్ఞాపకాలు
జీవితంలో ముందుకు సాగేందుకు స్ఫూర్తిని నింపేది జ్ఞాపకాలు
నిరాశతో నిండినపుడు
కొత్త ఆశలను చిగురింపచేసేది జ్ఞాపకాలు
విధి విపరీతానికి బలి అయిన మనిషికి
చివరికి మిగిలిన ఆస్తి జ్ఞాపకాలు

## అలనాటి స్నేహం
## రాజి చెన్నుపల్లి

అదే ఊరు అదే గుడి
తాయిలాలు మార్చుకున్న చిన్ననాటి స్నేహం
గుజ్జనగూళ్ళు కట్టిన అవే చేతులు
అమాయకంగా అలిగి ఏడ్చిన అవే కళ్ళు
మన మాటలు విని మురిసిన అవే చెట్లు
చల్లని గాలితో లాలించిన అవే పంటపొలాలు
సేద తీరమని అడిగే అదే రావిచెట్టునీడ
జ్ఞాపకాల పరిమళాలు వెదజల్లే అదే సన్నజాజి
చిన్ని చిన్ని చేతులతో దాహం తీర్చిన అదే కోనేరు
తెలిసీతెలియని భక్తికి మురిసిన అలనాటి రామయ్య
అల్లిబిల్లి ఆటలతో అలసి సేదతీరిన అదే మైదానం
ప్రియనేస్తం
కాని ఇప్పుడు
అనుభవించేందుకు అందమైన బాల్యం లేదు
వయస్సు మరచిపోయి, అంతస్తుల అంతరాలు మరచి ఆడే
కల్మషం లేని మంచి మనసులు మనకు లేవు.....

## జన్మల బంధం
### పల్లాపు రాము, నెల్లూరు

శూన్యత నిండిన

అంతరాల కన్నుల లోయలలో ,

ఆర్ద్రత నిండిన

వేదనా ప్రవాహాలు

పరవళ్ళు తొక్కే సమయాన ,

గుప్పెడు మౌనాన్ని దోసిళ్ళలో బంధించి

విషాద విహారంపై చల్లుతూ

ఆనంద రహదారికి వేలును చూపిస్తూ

నన్ను ముందుకు నడిపిస్తున్నావు

నా ప్రియ మధువనీ !

జన్మ జన్మకూ నాకు

జతగా ఉంటావు కదూ !?

## అగాధం
### సత్య

అగాధం లోంచి చేతులు
ఆకాశాన్ని చూస్తున్నాయ్
అంతు తెలుసుకుందామని.....
అర్థం చేసుకుందామని నేను!

అర్థం అయ్యేకొద్దీ
అంతు పెరుగుతుంది.
లాక్కొచ్చిన ఆలాపన..
లోతు పెంచుతుంది !

ఏమీ తెలేని నా
ఎడారి బతుకే బాగుండేది
గమ్యం తెలీక పోయినా...
కనీసం ప్రయాణమైనా సాగుతుండేది!

కట్టిపడేసిన అలోచనతో
కుంచించుక పోయి లోయలో నేను.
ఆడదాన్ని అర్థం చేసుకునే యత్నంలో .....
లోతుతెలియని  అగాధంలో నేను!

## నయాగరా జలపాతం
### న్యాయపతి వెంకటమణి

అది జలపాతమా
ఆదిశేషుని వే యిపడగల హుంకారమా
కవులకందని కదనకుతూహల కదనమా
పొరపాటున నిటలాక్షుని జటవీడిన గంగ వీరంగమా
నిశ్శబ్దంలో నిదురించిన శబ్దతరంగమా
వే యినదుల ఝుర్ఝురీ తరంగ విస్ఫులింగమా
కోటి మృదంగముల మేటినాదమా
జంబూద్వీప జనిత ఘోషారావమా
రాగాద్వేషాజ్వలిత కోలాహలమా
తరంగ విహీన హృదయాంతరంగమా
విరించి సతి మీటిన విపంచి నాదమా
ఊహకందని ఉత్తేజం
భాషకందని భావోద్వేగం
ధ్వని నిండిన మౌనభాష్యం
శబ్దంలో నిశ్శబ్దం
వడిలో వరవడి
తుంపరల తూణీరాలు
తనువుకు మృదులాలు
మనసుకు మధురాలు
నయనాలకు నయగారాలు
తపోదీక్షకు అనుకూలాలు
నిలచి నిలచి చూస్తే దృష్టికి ఝరి నీలాలు
తరచి తరచి చూస్తే మిధ్యా సృష్టికి మూలాలు
అవే నయగారా జలాలు

## రాగబంధం
### రాళ్ళపల్లి రామసుబ్బారావు

వేణువుకు మోహన రాగానికి మైత్రి
వేకువకు భూపాలానికి సంబంధం ,
వీణకు కదనకుతూహలానికి అన్యోన్యత
సప్తస్వరాల గాంధర్వ విద్య సంగీతం ,
సంగీత జ్ఞానము భక్తి వినా సన్మార్గము
వేదమె సామ సంహిత భారత సంగీతము ,
సామగాన లోల మనసిజ లావణ్యము
ముముక్షువులకు మోక్షసాధనము ,
మహాదేవుడి సప్తముఖములు
వామదేవ, అఘోర తత్పురుష ,
పరమశివ, ఈశ్వర, సద్యోజాత
ఈశానలే స్వరాల జన్మస్థానాలు ,
షడ్జమం, రిషభం, గాంధారం
నిషాదాలే 'స రి గ మ లు' ,
మధ్యమం, పంచమం, దైవతం
సప్త గ్రహములకు అనుబంధాలు ,
శుద్ధ మధ్యమము శంకరాభరణము
ప్రతి రాగానికి ప్రత్యేక జీవస్వరం ,
కల్యాణిలో ప్రతి మధ్యమము
వివిధ రంగులతోను సంబంధము ,
దేహానికి తెలుసు సంగీతసారం
రాగంతో రోగం కుదుర్చుకోవడం ,
జీవధాతువులు పిల్చుకునే స్వరచైతన్యం
మానవాళికి మేలైన చికిత్సావిధానం ..!!

# రసరేఖలు

శ్రీధర్ బచ్చోటి

ఏమి కావలెనంచు ప్రశ్నింతువీవు
పాత్ర నిండుగ కన్నీరు వలయు నాకు
ఏల కన్నీరటంచు ప్రశ్నింతువీవు
బాష్పమెరుగని బ్రతుకు నిష్ఫలము నాకు

గుండెలోనెంత వెత కొట్టుకొనిన గాని
వెలికి రాదొక్క కన్నీటి బిందువైన
ఎంతయో మనసార రోదింపదలతు
చెక్కిలిని చేరలేదొక్క చుక్కయైన

ఎదను నిండిన యుద్వేగమెగసి యెగసి
గుండె బరువెక్కి మస్తిష్కమెండిపోయె
కనులు వర్షించలేకెంతొ కమలిపోయె
కడలి యలలన్ని తిరిగి లోకడకు చేరె

బ్రతుకు పూబాటనెందరాప్తజనులున్న
ఎడద లోతుల తాకలేరెవ్వరైన
తోడువై రమ్ము కన్నీటి త్రోవ యందు
ఎండిపోయిన దారి స్తంభించు మనసు

కలసి నాతోడ కన్నీరు కార్చు కొరకు
చింత మునిగిన నన్నొడ్డు చేర్చు కొరకు
వలయు నీ ప్రేమ నీ సహవాసమిపుడు
కన్నులందున జీవమ్ము కలుగవలయు

**Post your comments**